

పట్టించుకునే వారే కరువయ్యారు
రాష్ట్రంలో రైతుల సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. - 8లో



పీఏసీఎస్ చైర్మన్‌ను తొలగించాలి
రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 35°/25°
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ 45 మంది నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి, సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేవిధంగా చూడాలని ఆదేశించారు.

స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్‌గా నారాయణ అమిత్



నారాయణ అమిత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్‌గా నారాయణ అమిత్‌కు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నారాయణ అమిత్‌కు కలెక్టర్ బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా సెలవుపై వెళ్లి తిరిగి వచ్చిన రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సోమవారం విధుల్లో చేరారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇండోనేషియాలోని బాలిలో బ్యాంక్ ఆఫ్ ఇండోనేషియా, రీజనల్ పాలసీ ఫోరం 78వ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సహకార బ్యాంకుల ద్వారా వ్యవసాయ రంగానికి ఇస్తున్న రుణాలు, అభివృద్ధి తదితర అంశాలను సదస్సులో వివరించారు. వ్యవసాయ రంగంలో వేస్టేజీ, పొల్యూషన్ లేకుండా వనరులు వాడుకునే విధానం, ఇండోనేషియాలో వ్యవసాయ రంగంలో జరుగుతున్న అభివృద్ధి విధానాలను తెలుసుకోవడం కోసం క్షేత్ర పర్యటనలో ఆయన పర్యటించారు. ఈ సదస్సులో అన్ని జిల్లాల సహకార బ్యాంకుల చైర్మన్లు, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా మార్చాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

నల్లగొండ టౌన్: జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు కృషిచేసి క్షయ రహిత జిల్లాగా మార్చాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్క అర్బన్ హెల్త్ సెంటర్‌లో జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మందుల ద్వారా క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని, వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే జిల్లా కేంద్రంలోని టీబీ ఆస్పత్రిలో సంప్రదించి పరీక్షలు చేయించుకుని కోర్సు ప్రకారం మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

• తిరంగా ర్యాలీ



ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో నకిరేకల్ పట్టణంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ తిరంగా ర్యాలీ నిర్వహించారు. -నకిరేకల్

28న మినీ జాబ్ మేళా

నల్లగొండ: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 28న ఉదయం 10.30 గంటలకు నల్లగొండలోని ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి ఏదేని డిగ్రీ, డీ/బీ/ఎం ఫార్మసీ అర్హతలు ఉండి 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 7893420435 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కొనుగోళ్లలో రెండో స్థానం

నల్లగొండ జిల్లాలో 5.83 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- జిల్లాలో అంచనాకు మించి దిగుబడి
- సమన్వయంతో పనిచేసిన అధికారులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో నిజామాబాద్ జిల్లా నిలిచింది. ఆఖరి స్థానంలో అతి తక్కువ ధాన్యం కొనుగోలు చేసి ఆదిలాబాద్ జిల్లా నిలిచింది.

మొదటగా నల్లగొండలో కేంద్రాలు ప్రారంభం
రాష్ట్రంలోనే మొదటగా నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. యాసంగి కోతలు నల్లగొండ జిల్లాలో ముందస్తుగా రావడంతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఆ తర్వాత తిప్పర్తి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదే రోజు మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు.

రెండో స్థానంలో నల్లగొండ..
ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. 8.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలువగా.. 5.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి నల్లగొండ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. కాగా ఆదిలాబాద్ 249 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచింది.

ఇబ్బందులు ఎదుర్కొంటూ..
జిల్లాలో ధాన్యం దిగుబడిని వ్యవసాయ శాఖ అధికారులు సక్రమంగా అంచనా వేయలేకపోయారు. ప్రతిసారి వారు వేసిన అంచనాకు మించి ధాన్యం దిగుబడులు వస్తున్నాయి. దాంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అధికంగా వస్తోంది. అయితే ఈసారి యాసంగి సీజన్ సమయంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు రిటైర్డ్ కావడంతో డీఎం హరీష్‌కు ఇన్‌చార్జ్ డీఎస్‌వో బాధ్యతలు అప్పగించారు. రెండు కీలక పోస్టుల్లోను ఆయనే వ్యవహరించాల్సి వచ్చింది. కొన్ని రోజుల తర్వాత మహబూబ్‌నగర్ నుంచి వెంకటేశ్వర్లు డీఎస్‌వోగా బదిలీపై వచ్చారు. కొనుగోళ్ల భారం కలెక్టర్ మీద వేసుకుని జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రాన్ని ఏరోజుకారోజు తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తూ వచ్చారు. ధాన్యం సంచుల కొరత, లారీల కొరత ఎదురైనప్పటికీ ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ధాన్యం కొనుగోళ్లు చేశారు. దీంతో నల్లగొండ జిల్లా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది.

అంచనాకు మించి కొనుగోళ్లు..
జిల్లాలో మొత్తం 5.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు సంబంధించి 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే అంచనాకు మించి మొత్తం 5.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇచ్చిన టార్గెట్ 5.36 లక్షలు అయితే.. 5.83 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. అంటే 47 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేశారు. దాదాపు రూ.1350 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 82 వేల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు.

సమన్వయంతో పనిచేశాం



యాసంగి ధాన్యం కొనుగోళ్లలో కలెక్టర్ ఇలా త్రిపాఠి నిత్యం అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయడంతో కొనుగోళ్లలో ముందు వరుసలో ఉన్నాం. లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌తోపాటు ఇటు మిల్లర్లతో మాట్లాడి ధాన్యం దిగుమతి చేసేలా చర్యలు తీసుకున్నారు. కమిషనర్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు రైతులకు ధాన్యం డబ్బులు విడుదలయ్యాయి. వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేశాం.
–హరీష్, పౌర సరఫరాల శాఖ డీఎం

భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకమైనదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూములకు సంబంధించి సర్వేయర్లు వివిధ రకాల సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భూముల సర్వే, అసైన్డ్ భూముల సర్వే, ప్రాజెక్టుల నిర్మాణం సందర్భంగా భూ సేకరణకు సంబంధించి నిర్వహించే సర్వే, ఎఫ్ లైన్ సర్వేల సమయంలో సర్వేయర్లు ముఖ్యపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రెవెన్యూకు సంబంధించి గ్రామాలు, మండలాల అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, అంతర్గత సరిహద్దుల వివాదాల పరిష్కారానికి నిర్వహించే సర్వే విషయంలో సర్వేయర్లది కీలక పాత్ర అన్నారు. అనంతరం 150 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు కలెక్టర్ సర్వే సామగ్రి అందజేశారు. సర్వేయర్లకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఇన్‌చార్జ్ ఏడీ సుజాత, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ రమణయ్య, సూపరింటెండెంట్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నల్లగొండ: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం జరిగిన ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 4477 మందికిగాను 4180 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెకండియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 1373 మందికి 1268 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఇద్దరు ప్రధానోపాధ్యాయుల సస్పెన్షన్

నల్లగొండ, చందంపేట: పాఠశాలకు రాని ఉపాధ్యాయురాలి విషయంలో తప్పుడు రిపోర్టు ఇచ్చిన హెడ్మాస్టర్‌తోపాటు వేతనం మంజూరు చేసిన హెచ్‌ఎంను డీఈఓ భిక్షపతి సోమవారం సస్పెండ్ చేశారు. వివరాలు.. చందంపేట మండలంలోని కొర్రతండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న పర్వీన్ సుల్తానా అక్కడ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో అధికారులు డిప్యూటేషన్‌పై గాగిళ్లాపురం యూపీఎస్‌కు బదిలీ చేశారు. అయితే పర్వీన్ సుల్తానా సంవత్సర కాలంగా పాఠశాలకు వెళ్లడం లేదు. ఆ పాఠశాల హెచ్‌ఎం వేణుమాధవ్ ఉపాధ్యాయురాలు పాఠశాలకు రాకపోయినా వచ్చినట్లు తప్పుడు సమాచారం ఇచ్చారు. దీంతో పోలేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం సామ్యానాయక్ ఆమెకు వేతనాన్ని మంజూరు చేశారు. దీనిపై యూటీఎఫ్ నుంచి ఫిర్యాదులు రావడంతో డీఈఓ విచారణ చేయగా వాస్తవమని తేలింది. వారిని సస్పెండ్ చేసే విషయంలో ఆలస్యం జరుగుతుండడంతో యూటీఎఫ్ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈక్రమంలో ఇద్దరు హెచ్‌ఎంలను డీఈఓ సస్పెండ్ చేశారు. కాగా ఈ నెల 7న ఉపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానాను డీఈఓ సస్పెండ్ చేశారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి: ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం వేములపల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ పని జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. గతంలో ఉపాధి హామీ పథకానికి రూ.2లక్షల కోట్ల బడ్జెట్ ఉంటే ఇప్పుడు రూ.86 వేల కోట్లకు కేంద్రం కుదించిందన్నారు. అదేవిధంగా గతంలో 23 కోట్ల జాబ్‌కార్డులు ఉంటే ఇప్పుడు 13 కోట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఉపాధి కూలీలకు రూ.500 రోజువారి వేతనంతోపాటు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాల్వలు, చెరువుల పూడిక తీత పనులు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకానికి ఎక్కువ నిధులు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు చల్లబొట్ల ప్రణీత్ రెడ్డి, వడ్డెగాని సైదులు, రెమడాల భిక్షం, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజావాణి ఫిర్యాదులన్నీ పరిష్కరించాలి

నల్లగొండ: గ్రీవెన్స్ సందర్భంగా ప్రజావాణిలో కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారినుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వినతులు స్వీకరించిన వారిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డీఆర్‌ఓ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మేము ఇళ్లు కట్టుకున్న భూమికి రైతు భరోసా పొందుతున్నారు
నల్లగొండ మండలం కాకుల కొండారంలో గ్రామ కంఠంలో కట్టుకున్న భూమికి వేరే వ్యక్తులు రైతు భరోసా పొందుతున్నారని, దాన్ని రద్దు చేసి తమ పేర్లు ఆన్‌లైన్‌లో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు గ్రామస్తులు గ్రీవెన్స్‌లో విన్నవించారు. సర్వే నంబర్ 171 నుంచి 176 వరకు భూమిలో దోమలపల్లి ప్రభాకర్‌రావు తండ్రి నరసింహ పేరున రికార్డుల్లో చూపుతోందని తెలిపారు. ఈ సర్వే నంబర్లలో 200 గృహాలు ఉన్నాయని, ఆ సర్వే నంబర్లలో ఇళ్లు ఉన్నప్పటికీ రైతు భరోసా డబ్బులు పొందుతున్నారని వివరించారు. ఆ పట్టా రద్దు చేసి ఆ భూమిని గ్రామ కంఠం భూమిగా రెవెన్యూ రికార్డులో మార్పు చేయించాలని గ్రామానికి చెందిన గండిచెర్వు వెంకన్న, భిక్షమయ్య, ఉశయ్య, సైదులు, లవయ్యతోపాటు పలువురు మహిళలు విన్నవించారు.



కాకుల కొండారం గ్రామస్తులు

విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: నకిలీ విత్తనాలు అరికట్టేందుకు జిల్లాస్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో కూడిన విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, రైతులందరికీ రుణమాఫీ చేసి, రైతు భరోసా డబ్బులు వెంటనే జమ చేయాలని కోరారు. మిల్లెట్ పంటలను ప్రోత్సహించడంతోపాటు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని రకాల ఎరువులను రైతులను అందుబాటులో ఉంచాలని, చెరువులు, కుంటలు, కాల్వలకు మరమ్మతులు చేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, యాసంగి ధాన్యానికి వెంటనే బోనస్ ఇవ్వాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్, పిండి పాపిరెడ్డి, గడ్డం మహేష్, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, బీపంగి జగ్జీవన్ రామ్, గుండా నవీన్‌రెడ్డి, సాయన్నగౌడ్, రమణముదిరాజ్, భైరు సత్తయ్య, దాసోజు యాదగిరాచారి తదితరులు ఉన్నారు.

సాగు పనుల్లో రైతన్న బిజీ



- వర్షంతో ఊపందుకున్న దున్నకాలు
- విత్తనాలు సిద్ధం చేసిన వ్యవసాయ అధికారులు
- 11.60 లక్షల ఎకరాల్లో సాగు అంచనా



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

నల్లగొండ అగ్రికల్చర్: తొలకరి వర్షాలు ముందే కురుస్తుండడతో జిల్లా అంతటా రైతులు దుక్కలను దున్నుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రైతులు పత్తిచేలలో కట్టెను తొలగించుకుని సిద్ధంగా ఉండడంతో పత్తి సాగుకు అవసరమైన దుక్కులను దున్నుకుంటున్నారు. వరి, పత్తి విత్తనాల కొనుగోలు కోసం రైతులు పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్ గత వానాకాలం సీజన్ కంటే వారం ముందుగా ప్రారంభం కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేస్తోంది. ఆదివారం రోహిణి కార్తె ప్రారంభం కాగా.. జూన్ 8న మృగశిర కార్తె ప్రారంభం కానుంది. అదేవిధంగా జూన్ 11న ఏరువాక పౌర్ణమి కావడంతో రైతులు ఆ రోజు ఏరువాక ప్రారంభించనున్నారు.

పెట్టుబడుల కోసం తిప్పలు..
ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పంటల సాగుకు రైతులకు పెట్టుబడి కష్టాలు తప్పేలా లేవు. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నాలుగు ఎకరాలపై భూమి ఉన్న రైతులకు నేటివరకు అందని పరిస్థితి. ప్రస్తుతం వానాకాలం సీజన్ ఆరంభమవుతున్న నేపథ్యంలో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వానాకాలం సీజన్‌కు జూన్ మొదటి వారంలోనే గత ప్రభుత్వం పెట్టుబడి సాయం రైతు బంధు పేరుతో అందించింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం రైతు భరోసాపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో రైతుభరోసా వస్తుందో రాదో అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. గత యాసంగి సీజన్‌లో కూడా రైతులందరికీ రైతు భరోసా అందలేదు. వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది.

పత్తి సాగు వైపే మొగ్గు..
వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 11లక్షల 60 వేల ఎకరాల్లో వరి, పత్తి ఇతర పంటలు సాగు కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. అందులో సింహభాగంగా పత్తి 5,47,735 ఎకరాల్లో, వరి 5,25,350 ఎకరాల్లో, మిగతా కంది, పెసర, వేరుశనగ, సజ్జ, జొన్న పంటలు సాగు కానున్నాయి.



వ్యవసాయ సామగ్రి తీసుకెళ్తున్న రైతు

అందుబాటులో విత్తనాలు..
రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలను సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 13 లక్షల 80 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లు అవసరం ఉందని గుర్తించి దానికి అనుగుణంగా జిల్లాలోని విత్తన డీలర్ల వద్ద అందుబాటులో ఉంచారు. అదేవిధంగా లక్ష క్వింటాళ్ల వరి విత్తనాలను కూడా డీలర్ల వద్ద అందుబాటులో ఉంచింది. కంది, పెసర, వేరుశనగ విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. యాభై శాతం సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను జిల్లాలోని వ్యవసాయ సహకార సంఘాలు, గ్రోమోర్ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు.

దుక్కులు దున్నుకుంటున్నారు



నైరుతి రుతుపవనాలు మూడు రోజుల ముందే రావడం మంచి పరిణామం. ఇప్పటికే జిల్లా అంతటా రైతులు దుక్కులు దున్నుకుంటున్నారు. వానాకాలం సీజన్ జూన్ నుంచే ప్రారంభమవుతుంది. రుతుపవనాల కారణంగా కురిసిన వర్షాలతో రైతులు పత్తి విత్తనాలను పెట్టుకునేందుకు అవకాశం ఉంటుంది.
–పాల్వాయి శ్రవణ్‌కుమార్, జేడీఏ

క్లుప్తంగా

జాన్‌పహాడ్ దర్గా వద్ద అగ్నిప్రమాదం



దర్గా వద్ద దుకాణాల సముదాయాలకు అంటుకున్న మంటలు

పాలకవీడు: మండల పరిధిలోని జాన్‌పహాడ్ దర్గా వద్ద సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదవశాత్తు దుకాణాలకు మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పివేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. నాలుగు దుకాణాల్లో సుమారు రూ.5లక్షల విలువగల సామగ్రి మంటల్లో కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: డివైడర్‌ను బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి నార్కట్‌పల్లి మండల పరిధిలోని కామినేని ఆస్పత్రి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాండ్ర గ్రామానికి చెందిన ఎరుపుల ఉపేందర్ (31) అంబులెన్స్ వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీగా కామినేని ఆస్పత్రి వద్ద వాహనం నిలిపి, బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కోనేరులో మునిగి బాలిక మృతి

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి విచ్చేసిన భక్తుల్లో, నీటి గుండంలో మునిగి బాలిక మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఆవీర్ (7) అనే బాలిక తన కుటుంబ సభ్యులతో కలిసి, యాదగిరిగుట్టకు ఆదివారం వచ్చింది. ఈ క్రమంలో గుండంలో స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయింది. వెంటనే బాలికను, యాదగిరిగుట్టలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, ఆ తర్వాత భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నీళ్లు మింగడంతో బాలిక మృతి చెందిందని నిర్ధారించారు.

మోసాలకు పాల్పడుతున్న యువతి అరెస్టు!

- ఐఏఎస్ అంటూ డబ్బున్న యువకులకు వలపు వల
- బ్లాక్‌మెయిల్ చేసి రూ.లక్షల్లో వసూలు

మిర్యాలగూడ అర్బన్: తాను డాక్టర్, ఐఏఎస్ అధికారిని అంటూ డబ్బున్న యువకులను గుర్తించి మోసాలకు పాల్పడుతున్న యువతిని మిర్యాలగూడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. మిర్యాలగూడ మండలం లావుడి తండాకు చెందిన ఓ యువతి కొంత కాలంగా డబ్బున్న యువకులను బ్లాక్‌మెయిల్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం. ఆమెపై మలక్‌పేట, చైతన్యపురి, ఉప్పల్, నల్లగొండ టూటౌన్, మిర్యాలగూడ వన్‌టౌన్, నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. గత మూడు రోజుల క్రితం యువతి మర్డర్ అంటూ హైదరాబాద్‌లోని ఓ డీఎస్పీకి, మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలో ఓ సీఐకి ఫోన్‌చేసి స్విచ్ ఆఫ్ చేసినట్లు తెలిసింది. గత సంవత్సరం ఓ వైద్యుడిని బెదిరించి అతడి నుంచి రూ.5లక్షలు వసూలు చేసి ఉడాయించినట్లు సమాచారం. ఇటీవల ఓ యువకుడిని డబ్బులు డిమాండ్ చేయడం తోపాటు డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించడంతో సదరు యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సదరు యువతి బాగోతం వెలుగుచూడటంతో నివ్వెరపోయారు. యువతిని అరెస్టు చేసిన పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా రిమాండ్ చేసినట్లు తెలిసింది.

చిట్టితల్లికి పెద్దకష్టం

- క్యాన్సర్‌తో పోరాడుతున్న 14 నెలల చిన్నారి
- చికిత్స చేయించే ఆర్థికస్థోమత లేక తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- ఆదుకోవాలని వేడుకోలు

కన్నీటి గాథ



చికిత్స పొందుతున్న షేక్ ఐరా

భూదాన్‌పోచంపల్లి: 14 నెలల చిన్నారికి పెద్ద కష్టమొచ్చింది. జువైనల్ మైలో మోనోసైటిక్ లుకేమియా అనే క్యాన్సర్‌తో బాధపడుతోంది. తల్లిదండ్రులు కన్నబిడ్డను కాపాడుకోవడానికి ఆర్థిక స్థోమత లేక తల్లడిల్లుతున్నారు. దాతల ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామానికి చెందిన షేక్ జమాల్‌కు మొదటి సంతానంగా షేక్ ఐరా జన్మించింది. ఆరు నెలల క్రితం చిన్నారికి తీవ్ర జ్వరం వచ్చింది. ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. ఈ క్రమంలో కడుపు ఉబ్బి పాలు తాగడానికి ఇబ్బంది పడింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపిస్తే గ్యాస్ ట్రబుల్ అని మందులు ఇచ్చి పంపించారు. కానీ చిన్నారి ఆరోగ్యంలో ఎలాంటి మార్పు లేకపోవడంతో బీబీనగర్ ఎయిమ్స్ వైద్యుల సలహా మేరకు నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే నెలరోజుల పాటు ఆస్పత్రిలో ఉన్నారు. రక్తంలో హిమోగ్లోబిన్ లేదని ఎముక మజ్జ టెస్టులు చేయగా రిపోర్టు నార్మల్‌గా వచ్చింది. దీంతో డాక్టర్లు మందులు రాసి పంపించారు.

ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థత

ఐరాకు ఉన్నట్టుండి మూత్రవిసర్జన ఆగిపోయి, కడుపు ఉబ్బి తీవ్ర అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు నెల రోజుల క్రితం బీబీనగర్ ఎయిమ్స్‌లోని ఐసీయూలో చేర్పించారు. పరీక్షలు చేయగా చిన్నారికి జువైనల్ మైలో మోనోసైటిక్ ల్యుకేమియా అనే క్యాన్సర్ వచ్చిందని డాక్టర్లు నిర్ధారించారు. కాలేయం, ప్లీహానికి కూడా వాపు వచ్చిందని, చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారు. కీమోథెరపి చేయాలని, అవసరమైతే ఎముక మజ్జ మార్పిడి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తెలిపారు. కూలీనాలీ చేసుకొని జీవనం సాగించే జమాల్ కుటుంబం తన బిడ్డను మెరుగైన చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమతలేక ఇబ్బంది పడుతున్నాడు. గత ఆరు నెలలుగా బిడ్డను కాపాడుకోవడానికి ఆస్పత్రుల చుట్టూ తిరిగి ఇప్పటికే రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాడు. ప్రస్తుతం ఐరా బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లోని పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో అత్యవసర చికిత్స పొందుతోంది. చిన్నారికి రెండు మూడు రోజుల కొకసారి రక్తం, ప్లేట్‌లెట్‌లు ఎక్కించాల్సి వస్తుందని మందులు, టెస్టులకు వేలల్లో ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆపన్నహస్తం అందించి ఆదుకోవాలని, సాయం చేసే దాతలు 76750 88204 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని కోరుతున్నారు.

రైతుల సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ఐకేపీ కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): రాష్ట్రంలో రైతుల సమస్యలు పట్టించుకునే వారే కరువయ్యారని, ముఖ్యమంత్రి, మంత్రులు ఎవరి దోపిడీ వాళ్లదే అన్నట్లు వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సోమవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ఏపూరు గ్రామంలో ఐకేపీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఐకేపీ కేంద్రాల్లో రైతులు ధాన్యం తీసుకువచ్చి 60 రోజులు దాటుతున్నా కాంటాలు కాకపోవడం దారుణమన్నారు. రుతుపవనాలు వచ్చి దుక్కులు దున్నాల్సిన రైతులు ప్రతిరోజు ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సి వస్తోందన్నారు. కాంటా అయిన తర్వాత కూడా మిల్లులో నిర్వాహకులు రైతులతో బేరమాడుతున్నారని, చివరికి రైతులు దళారుల కాళ్లు పట్టుకునే దుస్థితి దాపురించిందని, ఇదంతా కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత అని దుయ్యబట్టారు. ఐకేపీ కేంద్రాల్లో ప్రతిగింజనూ ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ నాయకత్వంలో చంద్రబాబు ఆడించినట్లు రేవంత్ ఆడుతున్నాడని, నదుల నీళ్ల దోపిడీకి గురవుతున్నా నోరు మెదపడం లేదని ఆరోపించారు. బనకచర్లతో గోదారి దోపిడీకి మరో కుట్ర జరుగుతోందని, మన జలాలను కాపాడుకునేందుకు రేవంత్ మొద్దునిద్ర వీడాలన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోలేమని కేసీఆర్ నాయకత్వంలో మరో ఉద్యమం తప్పదన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ ఉన్నారు.

పక్షం రోజుల్లోనే దంపతుల మృతి

- ఆర్థిక సమస్యలతో భార్యాభర్తల మధ్య వివాదాలు
- ఈనెల 13న ఆత్మహత్య చేసుకున్న భార్య
- మనస్థాపంతో చేనేత రంగుల్లో కలిపే రసాయనం తాగి భర్త బలవన్మరణం
- అనాథలైన ఇద్దరు చిన్నారులు



భాస్కర్ (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: పక్షం రోజుల్లోనే ఇద్దరు దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ సంఘటన సోమవారం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గోశిక భాస్కర్(42)కు ఇదే గ్రామానికి చెందిన పాలాది నవ్యతో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు సుభాష్(8), మహాలక్ష్మి(6) ఉన్నారు. భాస్కర్ ఇంటి వద్దే చేనేత కార్మికుడిగా పని చేస్తుండగా నవ్య భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. కరోనా తర్వాత చేనేత పని కుంటుపడడంతో కుటుంబంలో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవ జరుగుతూ ఉండేది. ఈ క్రమంలో ఈనెల 13న నవ్య చేనేత రంగుల్లో వాడే రసాయనం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై నవ్య సోదరుడు పాలాది రాఘవేంద్ర తన సోదరి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనికి తోడు భార్య చనిపోవడానికి భర్తే కారణమని భార్య మేనమామ మిగతా బంధవులు పదేపదే అనడంతో భాస్కర్ మనోవేదనకు గురయ్యాడు. మరోవైపు భార్య సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించి భాస్కర్‌పై కేసు నమోదు చేశారు. ఈక్రమంలో భాస్కర్ ఆదివారం అర్ధరాత్రి చేనేత రంగుల్లో కలిపే రసాయనాన్ని తాగి నిద్రపోయాడు. సోమవారం ఉదయమైనా భాస్కర్ నిద్ర లేవకపోవడంతో తల్లి నిద్ర లేపగా అప్పటికే భాస్కర్ మృతి చెంది ఉన్నాడు. భాస్కర్‌ను వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలున్న పాలాది రాఘవేంద్ర, శ్రీనాథ్, సతీష్, సత్యనారాయణ, భాగమ్మలపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఆలనాపాలన చూసే వారు కరువు

అల్లారు ముద్దుగా పెరగాల్సిన బాల్యంలో విధి వారి పట్ల తీరని లోటును మిగిల్చింది. తల్లి మరణించి పక్షం రోజులు గడవక ముందే తండ్రి ఆత్మహత్య చేసుకోవడంతో ఇద్దరు చిన్నారులు సుభాష్, మహాలక్ష్మి అనాథలయ్యారు. వారి తాత, నానమ్మ వృద్ధాప్యంలో ఉన్నారు. దీంతో చిన్నారుల ఆలనాపాలన చూసే వారు కరువయ్యారు. బంధువులు రోదిస్తుంటే చిన్నారులు వారి ముఖాలు చూస్తూ ఉండిపోయారు. చిన్నారులను చూసి అక్కడికి వచ్చిన గ్రామస్తులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

నకిలీ ఇక్కత్ డిజైన్లను అరికట్టాలి



కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాన్‌జీని సన్మానిస్తున్న టై అండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు లవకుమార్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ నకిలీ డిజైన్లను అరికట్టాలని కోరుతూ సోమవారం టై అండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ హైదరాబాద్‌లో కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితన్‌రామ్ మాన్‌జీని కలిసి విన్నవించారు. హైదరాబాద్‌లోని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోచంపల్లి నుంచి భారత లవకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, చేనేత వ్యాపారులకు వ్యాపార స్థాపనకు ఆర్థిక సహకారం అందించాలని కేంద్రమంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ ఆయనను సన్మానించారు.

సాగులో విత్తన ఎంపికకు ప్రాధాన్యమివ్వాలి

- కంపాసాగర్ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త లింగయ్య



మాట్లాడుతున్న శాస్త్రవేత్త లింగయ్య

నిడమనూరు : సాగర్ ఆయకట్టులో పండే వరికి ఎంతో డిమాండ్ ఉందని, దానికి అనుగుణంగా మేలైన వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త లింగయ్య సూచించారు. సోమవారం నిడమనూరు మండలంలోని శాఖాపురంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగులో సన్నాహకంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం అనుబంధ వరి పరిశోధన క్షేత్రం పలు కొత్త రకాల వంగడాలను, నిరంతరం స్థానిక వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా యాజమాన్య పద్ధతులపై పరిశోధనలు చేస్తుందని తెలిపారు. రైతులకు అందుబాటులో మేలైన వరి విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కంపాసాగర్ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన సన్నరకాలు కేపీఎస్ -6251, కేపీఎస్ -2874 వంటి రకాలతోపాటు, కేఎన్‌ఎం-1639, ఆర్ ఎన్‌ఆర్-1508, జేజేలు-27356 సన్నరకాలతో పాటు దొడ్డు ధాన్యం కేఎన్‌ఎం-118. జేజేఎల్-24423 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయకట్టులో నిరంతరం వరి సాగుతో భూముల్లో సారం కోల్పోయి, చౌడు బారుతున్నాయని దీని నిరోధానికి పచ్చిరొట్ట, జీలుగ దుక్కిలో వేసి, నాటే ముందు కలియదున్నాలని శాస్త్రవేత్త లింగయ్య సూచించారు. శాస్త్రవేత్త వి శ్రీధర్ మాట్లాడుతూ వరి సాగులో యాజమాన్య పద్ధతులు వివరించి, నాటు ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తే పెసర్లు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మునికృష్ణయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి విజయచంద్ర, పశు వైద్యాధికారి సుధాకర్ నాయక్, రైతులు మాజీ సర్పంచ్ ఇరుగుల వెంకట్ రెడ్డి, బొజ్జ లాజర్ సీహెచ్ సూర్యానారాయణ, బారెడ్డి ప్రతాప్ రెడ్డి, రాముడు, వెంకటయ్య పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలి

- కీతవారిగూడెంలోని సంఘం కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

గరిడేపల్లి: మండల పరిధిలోని రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ సోమవారం సంఘం పరిధిలోని రైతులు అఖిల పక్షం ఆధ్వర్యంలో కీతవారిగూడెంలోని సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అభివృద్ధిలో రాయినిగూడెం సంఘం రెండో స్థానంలో ఉందని, అలాంటి సంఘాన్ని చైర్మన్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలతో నేడు నష్టాల పాలైందని విమర్శించారు. రాయినిగూడెం సొసైటీ ఉప విభాగమైన వెలిదండ సొసైటీలో ప్రహరీ నిర్మాణం చేపట్టి రూ. 6.65లక్షలు డ్రా చేశారని, కేవలం రూ.70వేలతో ప్రహరీ నిర్మించి చేతులు దులుపుకున్నారన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న చైర్మన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘం సీఈఓ కనకయ్య మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారని చైర్మన్‌పై విచారణ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించారన్నారు. ధర్నాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, వివిధ పార్టీల నాయకులు, పెండెం వీరస్వామి, మేకల కనకారావు, బాలకృష్ణ, రాపోలు నవీన్, కామళ్ల నవీన్, గడ్డం అనిల్, మాశెట్టి అంజయ్య, బాదే నరసయ్య, గుంటి వెంకటేశ్వర్లు, గండు మల్లయ్య, కామల్ల ఆంథోని, ప్రసాద్, అంజయ్య, రవి, సోమయ్య, శ్రీను, భిక్షం, రాంబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలం రాయినిగూడెం సొసైటీ ఉపవిభాగమైన వెలిదండలో పీఏసీఎస్ ప్రహరీ నిర్మాణం పేరుతో రూ 6.62 లక్షలు నిధులు దుర్వినియోగం చేశారని సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట అఖిలపక్ష ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. వారిలో సోమయ్య, అంజయ్య, శంబయ్య, గోపి, లక్ష్మయ్య, నారాయణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని తంగడపల్లి క్రాస్‌రోడ్డు వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన కడతాల సత్తయ్య, అతని భార్య పార్వతమ్మ(55) కలిసి వలిగొండ మండలం సంగెం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగ నిమిత్తం తమ బంధువుల ఇంటికి వెళ్లారు. పండుగ ముగిసిన తర్వాత ఆదివారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై తంగడపల్లి చౌరస్తా వద్ద నారాయణపురం వైపునకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పార్వతమ్మ మృతిచెందింది. మృతురాలి భర్త సత్తయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బొమ్మలరామారం: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన బొమ్మలరామారం మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లిగుండ్లతండాకు చెందిన దీరావత్ భాస్కర్ (35) అతడి భార్య లావణ్యతో కలసి గ్రామాల్లో ఆటోలో తిరుగుతూ ఉల్లిగడ్డ, ఎండు మిర్చి, అల్లం వెల్లుల్లి అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో వ్యాపారం సరిగా నడవక ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో భాస్కర్ మానసిక వేదనకు గురయ్యాడు. ఆటోలో వ్యాపారం నిమిత్తం ఆదివారం సిరిసిల్ల ప్రాంతానికి వెళ్లిన భాస్కర్ స్వగ్రామమైన పిల్లిగుండ్లతండాకు తిరిగి వచ్చాడు. మధ్యాహ్నం ఓ వ్యవసాయ బావి వద్ద గడ్డిమందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న భాస్కర్‌ను గమనించి భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నాగభూషణంచారి తెలిపారు.

విద్యలో సమూల మార్పులు రావాలి

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ప్రచార జాతాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నకిరేకల్: విద్యలో మార్పులు రావాలని, ధనవంతుల పిల్లలు, పేదల పిల్లలు ఒకే బడిలో చదువుకోవాలన్నాదే తమ వేదిక లక్ష్యమని తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ బడులు నిలబడాలి.. చదువుల్లో అంతరాలు పోవాలనే నినాదంతో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతా సోమవారం నకిరేకల్‌కు చేరుకుంది. ఈ జాతకు స్థానిక టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్య తీవ్ర సంక్షోభంలో ఉందని, సమూల మార్పులతో తగిన చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ బడులు నిలబడతాయని, లేకుంటే నాలుగైదు ఏళ్లలో మెజార్టీ బడులు విద్యార్థులు చేరక మూత పడిపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రజార జాత చేపట్టి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు తాటిపాముల నర్సింహమూర్తి, ఆర్.రాకేష్‌కుమార్, పి.జయసాగర్, కే.శ్రీనివాస్, రవికుమార్, ఆర్.వెంకన్న, ప్రజా సంఘాల నాయకులు ఎర్పుల తాజేశ్వర్, అంజిరెడ్డి, ప్రకాష్‌రావు, వంటెపాక వెంకటేశ్వర్లు, వంటిపాక కృష్ణ, నాగమణి, ఇందిర, రవీందర్ తదతరులు పాల్గొన్నారు.

సాయినాథుడి ఆలయం ముస్తాబు

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవాలు



వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబైన సాయినాథుడి ఆలయం

చింతపల్లి: చింతపల్లిలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవాలకు ముస్తాబవుతోంది. మంగళవారం ఉదయం మంగళ వాయిద్య సుంఘోషణ, గణపతి ప్రార్థన, గోపూజ నిర్వహించి ఉత్సవాలకు అంకురారోహణ చేయనున్నారు. బుధవారం గావ్యాంత పూజ, వాస్తు పూజ, వాస్తు హోమం జరిపించనున్నారు. గురువారం ఉత్సవాలను ముక్కామల పీఠాధిపతి శ్రీధర స్వామి, చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ కొడకండ్ల రామశరణ్ శర్మ, శైవాగమ ప్రతిష్టాచార్య శానకొండ శివ కిరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

కట్టంగూర్ : ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన శివనాగరాజు (22) ఇటీవల బీటెక్ పూర్తయింది. సోమవారం సాయంత్రం ఇంటి పై రూంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎంత పిలిచినా రాకపోయే సరికి పైకి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియరాలేదని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

చిట్యాల : పట్టణంలోని జాతీయ రహదారి మీదుగా లారీలో అక్రమంగా తరలిస్తున్న పశువులను సోమవారం చిట్యాల పోలీసులు పట్టుకున్నారు. చిట్యాల ఎస్‌ఐ ఎస్.ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామానికి చెందిన సంపంగి ప్రవీణ్, సంపంగి రాజు, చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన పల్లపు నవీన్, శ్రీకాకుళం జిల్లా నైరా గ్రామానికి చెందిన చల్లా బాలాజీ, అముదాలవలస గ్రామానికి చెందిన పాడిగ అప్పారావులు శ్రీకాకుళం జిల్లా గోటివాడ గ్రామానికి చెందిన యేర్నేని బాబు సూచనలతో శ్రీకాకుళం జిల్లా నుంచి హైదరాబాద్‌కు లారీలో 41 పశువులను తరలిస్తున్నారు. చిట్యాల పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంట వ్యర్థాలు.. భూమికి సారం

- కలియ దున్నితే బహుళ ప్రయోజనం



పాడిపంట

త్రిపురారం : పొలాల్లో వరి కోతలు పూర్తయిన తరువాత రైతులు పంట వ్యర్థాలకు రైతులు నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. దీంతో వాతావరణంలో కాలుష్యం తీవ్ర స్థాయిలో పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వానాకాలం, వేసవి కాలంలో వరి కొయ్యలను పొలాల్లోనే కాల్చుతుండడంతో పల్లెల్లో సైతం వాతావరణం కాలుష్యంగా మారుతోంది. పంటలకు సంబంధించిన వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో నేలలో ఉండే పంటలకు మేలు చేసే కీటకాలు, సూక్ష్మజీవులు నశిస్తాయి. రైతులు పంట అవశేషాలను భూమిలో కలియ దున్ని పంటలు సాగు చేస్తే భూసారం పెరిగి పెట్టుబడుల ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడి పెరిగి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందొచ్చు.

వ్యర్థాలు భూమిలో కలియ దున్నడం వల్ల కలిగే లాభాలు

సాధారణంగా పంటల కోతల అనంతరం వ్యర్థాలు పొలాల్లో మిగులుతాయి. వరి కోతల తరువాత గడ్డి, వరి కొయ్యలు, ఇతర పంటల్లో అడుగున ఉండే మొక్కల భాగాలు పొలంలోనే ఉంటాయి. వాటిని కాల్చకుండా భూమిలో కలియదున్నడం వల్ల అవి మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారి భూసారం మరింత పెరుగుతుంది. నత్రజని, భాస్వరం, సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి. దీంతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు. సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. రైతులు పొలాల్లో పంటల వ్యర్థాలతో పాటుగా ఇతర వ్యర్థాలు కాల్చడం వల్ల వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్, మిథేన్, కార్బన్ మోనాక్సైడ్, విష వాయువులు విడుదలవుతాయి. వ్యర్థాలను భూమిల్లో కలియ దున్నడం వల్ల భూమికి మేలు చేసే కీటకాలు, సూక్ష్మ జీవులను కాపాడుకోవచ్చు. వాన పాములు వృద్ధి చెంది భూమికి మేలు చేస్తాయి.

గడ్డి, కొయ్యలకు ఇలా చేయాలి

- పొలాన్ని రోటవేటర్‌తో కలియ దున్నాలి. అప్పుడే వరి కొయ్యలు చిన్నచిన్న ముక్కలుగా మారుతాయి.
- దుక్కికి నీళ్లు పెట్టి ఎకరాకు 100 గ్రాముల సింగిల్ సూపర్ పాస్పేట్ వేసి 15 నుంచి 20 రోజులు పొలాన్ని నానబెట్టాలి.
- కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారే విధంగా సమయమివ్వాలి.

భూమి సారవంతంగా ఉండే విధంగా చూసుకోవాలి

పంటల సాగులో దిగుబడులు పెరగాలంటే ప్రతి రైతు నేలను కాపాడుకోవాలి. వ్యర్థాలను కాల్చడం వల్ల భూమికి మేలు చేసే సూక్ష్మ జీవులు నశిస్తాయి. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయి. చీడపీడల ఉధృతి సైతం పెరుగుతుంది. నేల పరిరక్షణతో పాటు వాతావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించడం ఉత్తమం.

– శ్రీనివాస రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్